సీఎం వైఎస్ జగన్‌తోనే పేదలకు మేలు

- బాబూ... మీరు చేసిన అభివృద్ధి చెప్పుకునే దమ్ముందా ?
- ఎమ్మెల్యే ఆళ్ల నాని



ముస్లిం మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలోనే లేని విధంగా అమ్మఒడి, ఆసరా, చేయూత, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్, ఫ్యామిలీ డాక్టర్ ఇలా అనేక పథకాలను అమలు చేస్తోందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అనానరు. ఏలూరు నగరంలో 98వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం రోడ్డులోని టీవీఎస్ షోరూమ్ సమీపం నుంచి పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. 45వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం లభించింది. తొలుత ముస్లిం మత పెద్దలు అల్లాహ్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో స్వయంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏదైనా సాంకేతిక లోపంతో పథకానికి దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ పథకాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా తనది అని చెప్పుకునేందుకు ఒక్కపథకమైనా ఉందా ? అని ప్రశ్నించారు. మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని సిగ్గులేకుండా ఎలా అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో రాష్ట్రం విడిపోయి కష్టాల్లో ఉన్నప్పుడు అధికారం ఇస్తే ఏకంగా రూ.2.34 లక్షల కోట్లు బొక్కేశారని, తన మందీ మార్బలానికి పంచేశారని ఆరోపించారు. ప్రజలకు మేలు చేయాలంటే అన్ని లక్షల కోట్లు అప్పులు చేసి ఏదైనా సంక్షేమ పథకాన్ని అమలు చేశారా ? అని ప్రశ్నించారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పు ప్రతి రూపాయీ ప్రజల వద్దకే నేరుగా చేరిందని, ప్రతి దానికీ లెక్కలు ఉన్నాయని చెప్పారు. ఒకవైపు అభివృద్ధి చేస్తూ మరోవైపు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే 2024లో ప్రజలు మరోసారి పట్టం కడతారని పేర్కొన్నారు. ప్రజలు మెచ్చిన నాయకుడు జగనన్న మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, యర్రంశెట్టి సుమన్, దేవరకొండ శ్రీనివాస్, కలవకొల్లు సాంబ, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు కిలాడి దుర్గారావు, పొలిమేర హరికృష్ణ, లీగల్ సెల్ దొంగ రామాంజనేయులు, సుల్తానా, అమీనా, విజయ కుమార్ జైన్, జనపరెడ్డి కృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, పీఓ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎంసీఆర్ పాదరక్షకుల నిమిత్తం ఆర్థిక సాయం



లెప్రా సొసైటీ నిర్వాహకులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) : కుష్టు బాధితులకు ఎంసీఆర్ పాదరక్షల నిమిత్తం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ లెప్రా సొసైటీ నిర్వాహకులకు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేసింది. స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో లెప్రా సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ వహీద్ బాషాకు ఈ మొత్తాన్ని అందించింది. బాషా మాట్లాడుతూ లెప్రా సొసైటీ ద్వారా 20 మంది కుష్టు బాధితులకు ఉచితంగా పాదరక్షలు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డి.భాస్కరరావు, లెప్రా సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ రాధిక, ఓఆర్‌డబ్ల్యూ రాణి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఢిల్లీలో రెజ్లర్ల పోరాటానికి మద్దతు

ఏలూరు (టూటౌన్) : ఢిల్లీలో రెజ్లర్లు చేస్తోన్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెజ్లర్లపై ఆ సంస్థ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రెజ్లర్లు వారాలు తరబడి దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేసి ఊరుకున్నారని వాపోయారు. రెజ్లర్ల లైంగిక వేధింపులకు బ్రిజ్ భూషణ్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసి, అరెస్టు చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వైపు వెళ్లే రోడ్డులో ఎన్ఆర్‌పేట ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి నడిచి వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు త్రీటౌన్ స్టేషన్ ఫోన్ నెంబర్ 08812 223833కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఫైలేరియా బాధితులకు మందుల పంపిణీ



ఫైలేరియా బాధితులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: దోమల నివారణతో ఫైలేరియాను అంతం చేయవచ్చని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. గురువారం 15వ డివిజన్‌లో ప్రజారోగ్య సిబ్బంది ఫైలేరియా మందులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ క్యూలెక్స్ దోమకాటు వల్ల ఫైలేరియా బారిన పడతామన్నారు. ఈ దోమలు నీరు నిల్వ ఉండే కుంటలు, డ్రెయినేజీ పరిసరాల్లో వృద్ధి చెందుతాయని చెప్పారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలని కోరారు. దోమ తెరలు ఉపయోగించడం వల్ల దోమకాటు నుంచి రక్షణ పొందచ్చన్నారు. ఫైలేరియా బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు.

కొల్లేరు భూముల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి



ప్రత్తికోళ్లలంక గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంకలో కొల్లేరు భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకుల కుట్రల వల్ల గ్రామ ప్రజల భూములు వివాదాస్పదమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. కొల్లేరు గ్రామాల్లో తవ్వకాలు చేపట్టే వారి నుంచి ఎమ్మెల్యే రూ.కోట్లు దండుకుంటున్నారంటూ టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దమ్ముంటే ఆరోపణలు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. సోమవారం నుంచి మూడురోజుల పాటు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమానికి ముందే అటవీ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేస్తుంటే, టీడీపీ నాయకులు రూ.కోట్లు దండుకుంటున్నారంటూ అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. తొలుత సర్పంచ్ ఘంటసాల మహాలక్ష్మీరాజు భూ సమస్యలు, వైస్ ఎంపీపీ బలే సత్యప్రసాద్ గ్రామాభివృద్ధి గూర్చి ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో జగనన్నకాలనీ లెవిలింగ్ పనులు పరిశీలించారు. ఆర్డీఓ పెంచల కిషోర్, డీఎస్పీ పైడేశ్వరరావు, అటవీశాఖ రేంజర్ ఎస్వీకె కుమార్ కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, జెడ్పీ వైస్‌చైర్మన్ ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మరడాని రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్‌లోని నార్త్ సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో చెట్ల కొమ్మలు నరకడం, విద్యుత్ లైన్లకు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అశోక్ నగర్, రామచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనుకాల రోడ్డు, ఏటి గట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, ఫైర్ స్టేషన్ సెంటర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి స్వీట్ సమ్మర్ క్యాంప్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి స్వీట్ సమ్మర్ క్యాంప్ పేరిట వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఏలూరు శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీరామ్ నగర్ 6వ రోడ్డులోని తమ సేవా కేంద్రంలో ఈశిబిరం ఏర్పాటు చేశామని, ఈ శిబిరం ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. నీతి కథలు, పఠనంలో మెలకువలు, విజ్ఞాన శాస్త్ర విషయాలు, యోగ సంగీతం, వ్యాయామాలు, ఆరోగ్యం పోషకాహారం, రాజయోగ, మెడిటేషన్, సంస్కృత భాష తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. నోట్‌బుక్, పెన్, పెన్సిల్, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. రెండు నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు హాజరుకావచ్చిని, ఈనెల 14న మదర్స్ డే పిల్లల పండుగ నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు 90529 12418 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

మేడే స్తూపాన్ని పునర్నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): మేడే సందర్భంగా మున్సిపల్ కార్మికులు తమ కష్టార్జితంతో ఏలూరు పంపుల చెరువు రోడ్డులోని వెహికల్ షెడ్డు వద్ద నిర్మించిన జెండా దిమ్మెను అక్రమంగా కూల్చివేడాన్ని అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించింది. గురువారం సాయంత్రం పంపుల చెరువు వెహికల్ షెడ్డు వద్ద ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకరరావు, సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, మాజీ కార్పొరేటర్ వీరంకి త్రినాథ్, జనసేన పార్టీ నాయకులు శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కోలపల్లి ఉమాశంకర్ మద్దతు తెలిపారు. జెండా స్థూపాన్ని కూల్చివేయడం అప్రజాస్వామికమని, అధికార యంత్రాంగం స్పందించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పడమర వీధిలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుని, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేశారు. రాత్రి 7 నుంచి స్వామి వారి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాజ్ఞిక బ్రహ్మ దీవి గోపాలాచార్యులు, అర్చక స్వామి రత్నాకరం శ్రీనివాస మూర్తి విశేష పూజలు చేశారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ రాళ్లపల్లి పద్మావతి, ట్రస్టీలు మధ్యాహ్నపు సుబ్రహ్మణ్యం, ఆర్.శ్రీనివాస్, శ్రీవారి సేవకుల, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.రవిశంకర్ పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-46	కీరా దోస	28
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	48	అల్లం	180
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	42	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	రద్దు
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	22
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	25

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలతో ఆలయంలోకి వెళుతున్న అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు గురువారం పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని అందజేశారు. ముందుగా పట్టు వస్త్రాలను శిరస్సుపై పెట్టుకుని ఆలయానికి విచ్చేసిన ఆయనకు శ్రీవారి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పట్టు వస్త్రాలను అర్చకులకు అందించి, స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

రాజ్యాధికారంతోనే మాదిగల అభివృద్ధి



చింతలపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఎస్‌పీ మహిళా నాయకులు

చింతలపూడి: మాదిగల రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమని మాదిగ మహిళ జాతీయ నాయకురాలు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సమన్వయకర్త చవటపల్లి విజయ మాదిగ అన్నారు. చింతలపూడి పట్టణంలో వైఎస్సార్ కాలనీలో గ్రామ కమిటీల ఎంపిక సమావేశం చింతలపూడి నియోజకవర్గ ఎంఎస్‌పీ కన్వీనర్ కొలికిపాము హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాదిగ మాట్లాడుతూ మన ఓటు మనకే అనే నినాదంతో మంద కృష్ణ మాదిగ ఏర్పాటుచేసిన మహాజన సోషలిస్ట్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ చింతలపూడి మండల కన్వీనర్ పొలిమేర నాగమణి, టి.నరసాపురం ఎంఎస్‌పీ కన్వీనర్ కొమ్ముకూరి సుగుణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయండి

చింతలపూడి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, గృహనిర్మాణ శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లులేని ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రంలో లక్షలాది ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. అధికారులు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీఓ మణికుమారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ పాల్గొన్నారు.

నేటి నుంచి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం - సరిపల్లి రోడ్డులో కొలువుదీరిన అప్పనపల్లి బాలబాలాజీ 42వ కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 5వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం, ఆరో తేదీ రాత్రి 7 గంటలకు భక్తి రంజని కార్యక్రమాలు, నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసాద వితరణ ఆఖరి రోజు సాయంత్రం 6 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొంది.

6న 'మనం - మన గ్రంథాలయం'

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిజిటల్ గ్రంథాలయాల సృష్టికర్త ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఈ నెల 6న మనం - మన గ్రంథాలయం అనే కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమౌతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి ఆరవు, గ్రంథాలయ పరిషత్ సభ్యుడు వై.నరసింహారావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి

టి.నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకార సంఘాలను బలోపేతం చేసి రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్మన్ దాసరి రాంబాబు అన్నారు. సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఆయన మాట్లాడారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, రైతులకు సకాలంలో రుణాలు మంజూరు, ఇతర సేవలు అందిస్తానని తెలిపారు. తనను చైర్మన్‌గా నియమించేందుకు కృషి చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు శ్రీను రాజులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాకారపు సూర్యారావు, పారేపల్లి సత్యనారాయణ, యర్రా గంగాధరరావు, వరికూటి సత్యనారాయణ, తోట రామారావు, కాసగాని రామారావు, గొల్లపల్లి భద్రయ్య, భుజంగరావు, కాళ్నీడి రమేష్, దాసరి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

కొయ్యలగూడెం: స్థానిక కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గం మధ్యలో బైనేరు సమీపంలో కొలువైన స్వయంభూః పంచముఖి శ్వేతార్క హేరంభ గణపతి, శ్రీచక్ర సహిత చండీ సమేత మహబలేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవం, కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం చండీ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ, రుద్ర చండీ, భైరవ హోమాలు నిర్వహించారు. చండీ సమేత మహబలేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్త, అర్చకులు మామిళ్లపల్లి ఆనంద శివాచార్య నేత్రపర్వంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీకాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆనంద శివాచార్య తెలిపారు. మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.